క్లుప్తంగా

అలయ్ బలయ్‌కి తరలిన నేతలు



మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల బీఆర్ ఎస్ పార్టీ నాయకులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమానికి వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయికుమార్, మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాలు పంపిణీ



భగవద్గీతను పంపిణీ చేస్తున్న సభ్యులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలో హైదరాబాద్ నగరానికి చెందిన ప్రబోధా సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం గ్రామస్తులకు భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేశారు. ప్రబోధా సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు సీహెచ్ గిరి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇతిహాసాలను తెలుసుకోవాలన్నారు. ఇంద్రియాలను జయించడమే కాకుండా పండుగ అర్థాన్ని, కుటుంబ విలువలను ఉత్తమ గ్రంథాలను చదవడం వల్ల తెలుసుకోగలమన్నారు. కార్యక్రమంలో నరసింహచారి, కుమార్, జషిత్‌కుమార్, మధు, లక్ష్మీ నాగమణి పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్ర



శబరిమలకు బయలుదేరిన భక్తులు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పాత బస్టాండ్ సమీపంలోని నవరత్న ఆలయం నుంచి కేరళలోని శబరిమలకు మహాపాదయాత్రగా సోమవారం అయ్యప్పస్వాములు బయలుదేరారు. 30 మంది అయ్యప్పస్వాములతో మూడోసారి పాదయాత్ర చేపట్టామని గురుస్వామి సాహితి రాము తెలిపారు. సుమారు 1600 కిలోమీటర్లు పాదయాత్ర కొనసాగనున్నదని పేర్కొన్నారు. శంకరపల్లి మీదుగా తిరుపతి చేరుకొని వేంకటేశ్వరుని దర్శనం చేసుకుని అక్కడి నుంచి కాణిపాకం అక్కడి నుంచి అరుణాచలం గిరి ప్రదర్శన చేసుకుని శబరిమల కొండకు పయనమవుతామని చెప్పారు.

పారా మెడికల్ పోస్టులకు దరఖాస్తులు

సంగారెడ్డి : సంగారెడ్డి మెడికల్ కళాశాలలో రెండు సంవత్సరాలు పని చేసినందుకు పారా మెడికల్ పోస్టుల భర్తీకి ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిప్లొమా ఇన్ ఆప్తల్మిక్ అసిస్టెంట్ కోర్సు డీఏఓ 30 సీట్లు, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సు డీఎంఐటీ 30 సీట్ల ప్రవేశాల కోసం ఆసక్తి, అర్హత గల అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత గల వారు www.tfpmbteanfana.gov.in గల అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించవచ్చు. ఆన్‌లైన్‌లో స్వీకరించిన దరఖాస్తులను సంగారెడ్డి మెడికల్ కాలేజ్ ఆఫీస్‌లో ఈ నెల 28న సా.5 గంటలలోపు సమర్పించాలని చెప్పారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

హత్నూర(సంగారెడ్డి): హత్నూర పోలీస్ స్టేషన్‌ను జిల్లా నూతన అదనపు ఎస్పీ రఘునందన్ రావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో పోలీసులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. నిష్పక్షపాతంగా కేసు దర్యాప్తులో కొనసాగించాలని అప్పుడే నేరస్తులకు శిక్షపడే అవకాశం ఉందన్నారు. ఎస్సై శ్రీధర్ రెడ్డితో పాటు సిబ్బందికి శాఖపరమైన సూచనలు చేశారు.

రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

మాజీ మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి: రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన హరీశ్‌రావుకు ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ కార్యకర్తలతో ఎమ్మెల్యే ప్రభాకర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. అనంతరం సంగారెడ్డి స్థితిగతులపై చర్చించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకత మొదలైందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం ఎందుకు?

- రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనం
- పట్టించుకోని అధికారులు



అంబేడ్కర్‌కాలనీ నుంచి తెల్లాపూర్ వెళ్లే మార్గంలో..



తెల్లాపూర్ నుంచి నల్లగండ్ల వెళ్లే రేడియల్ రోడ్డు వద్ద..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యం అమలు విషయంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు ప్రజలను హెచ్చరిస్తుండగా.. మరోపక్క అధికారులే ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎక్కడికి వెళ్లిన రోడ్లను అనుకుని చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. దీనిని బట్టి అధికారులు పారిశుద్ధ్యం విషయంలో ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. నెలకు లక్షలాది రూపాయాలు ఖర్చు చేస్తున్నా రోడ్లపై చెత్త కుప్పలే కనిపిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖర్చు విషయంలో విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పారిశుద్ధ్యం విషయంపై త్వరలో ఉద్యమానికి సిద్ధమంటూ స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.



విద్యుత్‌నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో..



తెల్లాపూర్ చౌరస్తా వద్ద ..



ఎలియాన్స్ చౌరస్తా సమీపంలో..

ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లోని పాత మున్సిపల్ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవుట్ పోస్టును సోమవారం సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డా.గజారావు భూపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని నూతనంగా తెల్లాపూర్ పరిధిలో ట్రాఫిక్ అవుట్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరు తూ.చా తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపే వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా అప్పలనాయుడు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్, ట్రాఫిక్ అదనపు డిప్యూటీ కమిషనర్ వీరన్న, ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్, కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ గణేశ్ పటేల్, రామచంద్రాపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.



ట్రాఫిక్ అవుట్‌పోస్ట్‌ను ప్రారంభిస్తున్న గజారావు భూపాల్

పల్లెప్రకృతి వనంలో చెట్లు నరికివేత



బద్రాతండా పల్లెప్రకృతి వనంలో నరికిన చెట్లు

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయడంతో పాటు రూ.లక్షల్లో ఖర్చు చేసి మొక్కలను నాటింది. గతంలో నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగాయి. అయితే మండల పరిధిలోని బద్రాతండా పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన చెట్లను పంచాయతీ కార్యదర్శి మోహన్ నరికి వేయించాడు. పల్లె ప్రకృతి వనంలో చెట్లను నరికి వేయడం ఎంత వరకు సమంజసమని తండావాసులు ప్రశ్నించారు. ఈ విషయమై కార్యదర్శిని వివరణ కోరగా.. పాములు వస్తున్నాయని కొంతమంది ఫిర్యాదు చేయడంతో చెట్లను నరికి వేయించామన్నారు. పాములు వస్తే ప్రకృతివనంలో పొదలు తొలగించాలే తప్పా చెట్లను నరికివేయడం సరికాదని మరి కొంతమంది ఆరోపిస్తున్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్: బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ బ్యాంకు ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రనీష్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక బీవీఆర్ఐటీ ఆవరణలో ఇండియన్ బ్యాంకు శాఖను విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ విష్ణురాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీ ఆవరణలో తమ బ్యాంకు శాఖతో పాటు ఏటీఎంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బ్యాంకు సేవలను అన్ని వర్గాల ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సొసైటీ చైర్మన్ విష్ణురాజు మాట్లాడుతూ కాలేజీ ఆవరణలో బ్యాంకును ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. బ్యాంకు జోనల్ మేనేజర్ పీఎస్ఎస్ సుధాకర్‌రావు మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణ ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలు తమ బ్యాంకులో సేవలు పొందవచ్చన్నారు. వ్యవసాయం, బంగారు నగలపై రుణాలు, గృహాలకు రుణాలు ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో స్థానిక బ్యాంకు మేనేజర్ వినయ్‌స్వరూప్, సొసైటీ వైస్ చైర్మన్ రాజగోపాల్, కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, ఇతర ప్రతినిధులు కృష్ణమోహన్, కాంతారావు, బాపిరాజు, సురేష్ పాల్గొన్నారు.



బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రనీష్‌కుమార్

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 11మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా 10 మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి, మరోకరి రూ.1500 చొప్పన జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

స్థలం కబ్జాపై చర్యలు తీసుకోండి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఖాళీస్థలం కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం మ్యతరి ప్రేమిల నాయబ్ తహసీల్దార్ బాలరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని మెలగిరిపేట గ్రామంలో గతంలో బలహీనవర్గాలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు చదును చేస్తూ కడ్డీలు పాతుతూ కబ్జాకు యత్నిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఆ స్థలాన్ని గ్రామానికి ప్రజలు సామాజిక అవసరాలకు వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. స్థలం కబ్జా కాకుండా కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త శ్రీధర్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా పోలీసు సేవలు

ఎస్పీ పరితోష్ పంకజ్



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎస్పీ

సంగారెడ్డి జోన్: ప్రజలు పోలీసు సేవలు స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజాసమస్యలపై దరఖాస్తుల స్వీకరించారు. చట్టాల అమలులో నిర్లక్ష్యం వహించకుండా, కేసులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

కంగ్టిలో కుండపోత వర్షం

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలో సోమవారం కుండపోత వర్షం కురిసింది. కంగ్టి నుంచి పిట్లం వెళ్లే రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని కాకివాగు, సాములవాగు ఉధృతిగా ప్రవహించడంతో బాన్సువాడ దామరగిద్ద, జంగి(బి), గాంధీనగర్, సాధువు తండా తదితర గ్రామాలకు కంగ్టికి సంబంధాలు తెగిపోయాయి. భారీ వర్షంతో చేతికొచ్చిన పంటలు నీటిపాలవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటల కోసం పెట్టిన పెట్టుబడి ఖర్చులు సైతం వచ్చే పరిస్థితి లేక నష్టాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంగ్టి: ఉధృతంగా పారుతున్న కాకివాగు



కల్హేర్: వంతెనపై నుంచి ప్రవహిస్తున్న మహరాజ్‌వాగు

మండలంలో భారీ వర్షం

మునిపల్లి(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం, సాయంత్రం వర్షం పడడంతో రైతులు, పశుపెంపకం దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాల్వలు, వంకలు పొంగిపొర్లాయి. వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాగులు, వంకలు ప్రవహిస్తున్న సమయంలో దాటడానికి వాహనదారులు ప్రయత్నించొద్దని బురేరా ఎస్ఐ రాజేశ్‌నాయక్ సూచించారు.

పొంగిపొర్లుతున్న నల్లవాగు

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగు అలుగుపై నుంచి వరద నీరు పొంగి ప్రవహించింది. సోమవారం ప్రాజెక్టు ఎగువ భాగం కంగ్టి మండలంలో కురిసిన వర్షంతో వరద తాకిడి పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1493 ఫీట్లు నిండడంతో అలుగుపై నుంచి వరద ప్రవహించింది. కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో భారీ వర్షం పడింది. కల్హేర్-పిట్లం మధ్యలో మహరాజ్ వాగు, మీర్ఖాంపేట్ వాగు, ఫత్తేపూర్-పిట్లం మార్గంలో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. సిర్గాపూర్ మండలం వంగ్దల్ గైరాన్ తండా వద్ద వాగు ప్రవహించింది. గైరాన్ తండావాసులు జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. సంగారెడ్డి-కామారెడ్డి జిల్లాల మధ్య రాకపోకలు స్తంభించాయి. పంట పొలాల్లో వర్షం నీరు నిలిచింది. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

పత్నూర(సంగారెడ్డి): సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన 'పరిహారం పరిహాసమేనా..!' కథనంపై వ్యవసాయ శాఖ అధికారుల్లో కదలిక వచ్చింది. సోమవారం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ప్రాథమిక అంచనా వేశారు. మంజీరా నది నీటి ఉధృతి ప్రభావంతో హత్నూర మండలంలోని బోరపట్ల, రెడ్డిఖానాపూర్, కాసాల, హత్నూర, నవాబుపేట, పన్యాల, బడంపేట్, కొన్యాలా, చీక్‌మద్దూర్, లింగాపూర్, సిరిపుర గ్రామ శివారుల గుండా మంజీరా నది నీటి ప్రవాహానికి పత్తి, వరి పంటలు నీట మునిగాయి. హత్నూర మండలంలో మంజీరా నీటి ప్రభావం వల్ల 1082 రైతులకు సంబంధించి వరి పంట సుమారు 1604 ఎకరాలు, పత్తికి సంబంధించి, 912 మంది రైతులకు చెందిన 1156 ఎకరాల్లో నీట మునిగి నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. మంజీరా నది నీటి ప్రవాహంతో నష్టపోయిన పంటల సమాచారాన్ని ప్రాథమికగా అంచనా వేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు చెప్పారు.



నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పెండింగ్ వేతనాల చెల్లించండి



అధికారిణికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టర్ కార్మికులు సోమవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ.. రెండు నెలల నుంచి మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. కార్మికులు దసరా పండగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని మండిడ్డారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ నాయకులు సంజీవ్, రాకేశ్, మోహన్ ఉన్నారు.

విధులపై నిర్లక్ష్యం తగదు

ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకటకిషన్

పటాన్‌చెరు టౌన్: మున్సిపల్ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకటకిషన్ రావు సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులు పరిసరాలను శుభ్రం చేయాలని అన్నారు. ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా.. చెత్త సేకరణ వాహనంలోనే వేసేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పృథ్వీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటకిషన్

భూబాధిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలి



రైతులతో మాట్లాడుతున్న రాంచందర్

జహీరాబాద్ టౌన్: పరిశ్రమల కోసం భూములిచ్చిన రైతుల కుటుంబ సభ్యులకు స్థానిక కర్మాగారాల్లో ఉద్యోగాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాంచందర్ డిమాండ్ చేశారు. సోమవారం బూచినెల్లి గ్రామ రైతులతో సమావేశమయ్యారు. మాయమాటలు చెప్పి రైతుల నుంచి విలువైన భూములు తీసుకుని ప్రభుత్వం వారిని మోసం చేస్తోందని ఆరోపించారు. భూబాధిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి పక్కరాష్ట్రాల వారిని కంపెనీలో చేర్చుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం జరగాలంటే రైతులు సీపీఎంకు అండగా ఉండాలని, స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు విటల్, రహీం, గోవర్ధన్, గుండప్ప తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థినికి సన్మానం

జహీరాబాద్ టౌన్: నీట్(ఎంబీబీఎస్) కౌన్సిలింగ్‌లో మెడికల్ సీటు సాధించిన గురుకుల విద్యార్థిని ఫిర్దోస్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు సోమవారం సన్మానించారు. బొప్పన్‌పల్లికి చెందిన సయ్యద్ కుమార్తె ఫిర్దోస్ మండలంలోని బూచినెల్లి మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ చదివింది. ఆమెకు నీట్ కౌన్సిలింగ్‌లో సిద్దిపేటలోని సురభి మెడికల్ కళాశాలలో ఫ్రీ సీటు వచ్చింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావుతో కలిసి హైదరాబాద్‌లో హరీశ్‌రావు నివాసంలో ఆయనను కలిశారు. ఈ మేరకు ఆయన విద్యార్థిని ఫిర్దోస్‌ను సన్మానించి తండ్రి సయ్యద్‌ను అభినందించారు. కష్టపడి చదివి జీవితం మంచిగా ఎదగాలన్నారు.



ఫిర్దోస్‌ను సన్మానిస్తున్న హరీశ్‌రావు, మాణిక్‌రావు

'బేటీబచావో.. బేటీపడావో'పై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నారాయణఖేడ్: మహిళా శిశుసంక్షేమశాఖ, మహిళా సాధికారిత కేంద్రం సంయుక్తంగా పట్టణంలోని నియోప్రగతి ఉన్నతపాఠశాలలో సోమవారం విద్యార్థులకు 'బేటీబచావో.. బేటీపడావో'పై అవగాహన నిర్వహించారు. మహిళా సాధికారిత కేంద్రం జిల్లా ఫైనాన్షియల్ స్పెషలిస్టు నర్సింహులు బాలికల హక్కులు, రక్షణ, పోక్సో చట్టం, లింగ సమానత్వం, లింగ సాధికారిత, బాల్య వివాహాల నిర్మూలనలో మన వంతు పాత్ర, టోల్ ఫ్రీ నంబర్లు 1098, 181ల గురించి సమగ్రంగా అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ వెంకటరత్నం, ప్రిన్సిపాల్ ప్రకాశ్ బాలబాలికల సామాజిక బాధ్యత, సమాన విద్య, సామాజిక మాధ్యమాల వల్ల జరిగే అనర్థాలను గురించి వివరించారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు

సదాశివపేట (సంగారెడ్డి): సదాశివపేట పలు ప్రాంతాల్లో చెట్లకొమ్మల్లో విద్యుత్ తీగలు ఉండడంతో ఈదురుగాలులు, వర్షాలు కురిసినప్పుడు విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది. అయ్యప్ప మందిరం సమీపం నుంచి ఈదుల వాగు వరకు ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మ ల్లో ప్రమాదకరంగా 33 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయి. ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడితే విద్యుత్ తీగలు తెగిపడడం, షాట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు జరిగే అస్కారం ఉంది. పట్టణంలో ప్రతి రోజు విద్యుత్ సిబ్బంది పర్యటిస్తునే ఉంటారు. అయినా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలు కనిపిస్తున్నా సరిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు పట్టణవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సదాశివపేట సబ్‌స్టేషన్ నుంచి మండల పరిధిలోని పలు పరిశ్రమలు, గ్రామాలకు సరఫరా అవుతున్న విద్యుత్ తీగలు చెట్లకొమ్మల్లో ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు ప్రత్యేక శ్రద్ధతో సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



చెట్లకొమ్మల్లో ఉన్న విద్యుత్ తీగలు

చెట్ల కొమ్మలను తొలగిస్తాం

పట్టణంలోని చెట్ల కొమ్మల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపడతాం. సబ్‌స్టేషన్ నుంచి మండల పరిధిలోని పరిశ్రమలకు వెళ్తున్న 33 కేవీ ఇండస్ట్రీయల్ లైన్ వైర్లు చెట్ల కొమ్మల్లో ఉంటే సిబ్బందితో చెట్ల కొమ్మలను నరికి వేయించి సరిచేస్తాం.

– మధుసూదన్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ, సదాశివపేట